## అధ్యాయము 20

# పది ఆజ్ఞలు మరియు నిబంధన గ్రంథము

**(భాగము 1)**

యెహోవా ఇశ్రాయేలీయులను నిబంధన అనుబంధములోనికి ఆహ్వానించిన తర్వాత, ఆ ప్రజలు ఆయన ఆజ్ఞాపించినదంతయు చేయుటకు అంగీకరించిరి (19:8). 20వ అధ్యాయములో, దేవుడు తన నిబంధనకు కావలసినవి వారికి తెలియజేసెను. మొదటిగా, 20:1-17లో, ఆయన వారికి పది ఆజ్ఞలు ఇచ్చెను. అప్పుడు, 20:22లో ప్రారంభమయ్యి, "నిబంధన గ్రంథము"గా పిలవబడేది ఇచ్చెను (20:22-23:33).

### పది ఆజ్ఞలు (20:1-17)

సీనాయి పర్వతము యొద్ద ఇవ్వబడిన పది ఆజ్ఞలు ఇశ్రాయేలుతో దేవుడు చేసిన నిబంధనలో మొదటి నియమములు. అవి రెండు మిగతా ధర్మశాస్త్రమునకు ప్రాథమిక మూలముగా మరియు ప్రతినిధిగా ఉండును. పది ఆజ్ఞలు "సహజముగా స్థిరపరచబడినవి," అనగా, అవి నైతిక పూర్ణమైనవి ("నీవు తప్పక" లేక "నీవు తప్పకుండా"). ఈ న్యాయ రూపము "నిబంధన గ్రంథము"లో కనబడు చాలా ఆజ్ఞలకు విరోధముగా నిలుచును, ఏవైతే "తర్కబద్ధమైనవో" అవి పూర్వనిర్ణయాధారిత కోర్టు తీర్పులు. ఆ ప్రత్యేక ఆజ్ఞలు షరతులతో, ప్రత్యేక పరిస్థితులతో వ్యవహరించును ("ఒకవేళ . . . అప్పుడు").

పది ఆజ్ఞలను "Decalogue" అని కూడా సూచించబడును. ఈ పేరు హెబ్రీ పదమైన עֲשֶׂרֶת הַדְּבָרִים (*ᵃśereth haddᵉbarim*) నుండి అక్షరార్థముగా ఉత్పన్నమైనది, ఇది పాత నిబంధన మొదటి ఐదు పుస్తకాలలో కొన్నిసార్లు కనబడును (34:28; ద్వితీ. 4:13; 10:4). పాత నిబంధన గ్రీకు అనువాదము ఆ పదమును δέκα λόγους (*deka logous*) గా అనువదించును; అక్షరాలా దాని అర్థము "పది మాటలు." ఈ నామము, కొన్ని ఆజ్ఞలను యిచ్చుటకంటె పైగా, వాటి సంక్షిప్తత గురించి చెప్పవచ్చు. ఆసక్తికరంగా, కొన్ని ఆజ్ఞలు హెబ్రీలో కేవలం రెండు పదాలుగా కనబడును (20:13-15).

ఏ చట్టాలు పది ఆజ్ఞలను తయారు చేయును? యూదా మతములో, దేవుడు

తాను ఎవరో 20:2లో చేసిన ప్రకటన పది ఆజ్ఞలలో మొదటిదిగా పరిగణింపబడును. ఇతరులు ఆ వచనమును, ఆజ్ఞలలో ఒకదానిగా కాకుండా ఉపోద్ఘాతముగా అర్థము చెప్పుదురు. "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు మరియు ఏ విగ్రమునైనను చేసికొనకూడదు" అను రెండవ ఆజ్ఞను చేయుటకు యూదులు 3-6 వచనములను ఒకటిగా కలిపారు.[1] రోమన్ కాథలిక్లు "3-6 వచనములను కూడా సంప్రదాయంగా కలిపిరి, కాని వాటిని మొదటి ఆజ్ఞగా చేయుటకు" మరియు "తర్వాత పదవ ఆజ్ఞను రెండుగా విభాగించి, కావసిన సంఖ్యను తయారుచేసెను."[2] ఈ వ్యత్యాసాలు సాపేక్షంగా తేలికైనవి, ఎందుకంటె ఏ విధముగా విభజించినా, ఆ వాక్యము యొక్క ఉపదేశము మారదు. ఈ వ్యాఖ్య చాలామంది ప్రొటెస్టెంట్లు ఉపయోగించే ఈ కింద వ్రాయబడిన పద్ధతిని అనుసరించును.

| **పది ఆజ్ఞలను లెక్కించుట**[3] | | |
|---|---|---|
| యూదా మతము | చాలామంది Protestants<br>Greek Orthodox<br>Philo మరియు Josephus<br>ఆదిమ సంఘము | Roman Catholics<br>Lutherans<br>Augustine |
| 1. నీ దేవుడైన యెహోవాను నేనే (20:2) | నీ దేవుడైన యెహోవాను నేనే (20:2) (ఉపోద్ఘాతము) | నీ దేవుడైన యెహోవాను నేనే (20:2) (ఉపోద్ఘాతము) |
| 2. వేరొక దేవుడు మరియు విగ్రహము ఉండకూడదు (20:3-6) | 1. వేరొక దేవుడు ఉండకూడదు (20:3)<br>2. విగ్రహము ఉండకూడదు (20:4-6) | 1. వేరొక దేవుడు మరియు విగ్రహము ఉండకూడదు (20:3-6) |
| 3. యెహోవా నామము (20:7) | 3. యెహోవా నామము (20:7) | 2. యెహోవా నామము (20:7) |
| 4. విశ్రాంతి దినము (20:8-11) | 4. విశ్రాంతి దినము (20:8-11) | 3. విశ్రాంతి దినము (20:8-11) |
| 5. తండ్రి తల్లి (20:12) | 5. తండ్రి తల్లి (20:12) | 4. తండ్రి తల్లి (20:12) |
| 6. నరహత్య (20:13) | 6. నరహత్య (20:13) | 5. నరహత్య (20:13) |
| 7. వ్యభిచారము (20:14) | 7. వ్యభిచారము (20:14) | 6. వ్యభిచారము (20:14) |
| 8. దొంగతనము (20:15) | 8. దొంగతనము (20:15) | 7. దొంగతనము (20:15) |
| 9. అబద్ధ సాక్ష్యము (20:16) | 9. అబద్ధ సాక్ష్యము (20:16) | 8. అబద్ధ సాక్ష్యము (20:16) |
| 10. పొరుగువానిది ఆశించుట (20:17) | 10. పొరుగువానిది ఆశించుట (20:17) | 9. పొరుగువాని (20:17a), పొరుగువానిది ఆశించుట<br>10. పొరుగువానిది ఆశించుట (20:17b) |

పది ఆజ్ఞలు చాలా సులువుగా రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటి గుంపులో నాలుగు దేవునితో ఒకరికి ప్రత్యక్షంగా ఉన్న సంబంధమును పాలించును: (1) "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు"; (2) "విగ్రహమును నీకొరకు చేసికొనకూడదు"; (3) "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు"; మరియు (4) "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము." రెండవ గుంపులో ఉన్న ఆరు ఒకరికి ఇతర మనుష్యులతో ఉన్న సమాంతర సంబంధమును పాలించును: (5) "నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము"; (6) "నరహత్య చేయకూడదు"; (7) "వ్యభిచరింపకూడదు"; (8) "దొంగిలకూడదు"; (9) "నీ పొరుగువానిమీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు"; మరియు (10) "నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు."

ఆజ్ఞలన్నిటిలో, "నీవు" అనే సర్వనామం ఏకవచనములో ఉండెను.[4] చాలా వరకు దేవుడు ఈ మాటలను ఆ ప్రజలందరి ఎదుట మాట్లాడెను (19:9; 20:19) మరియు ప్రతి వ్యక్తిగత ఇశ్రాయేలీయుడు ఈ ఆజ్ఞలను పాటించుటకు బద్ధుడైయున్నాడని వివరించుటకు ఏకవచనము వాడబడెను. ప్రత్నామ్నాయ దృష్టి ఏమిటంటే "సమిష్టిగా రెండవ వ్యక్తిలో" ఇశ్రాయేలు ఒక సమూహముగా ఆజ్ఞలు చెప్పబడెను.[5]

పది ఆజ్ఞలలో ఎనిమిది ప్రతికూల భాషలో ("నీవు చేయకూడదు"), కేవలం రెండు అనుకూలముగా ("జ్ఞాపకము చేసికొనుము" మరియు "సన్మానించుము") చెప్పబడెను. "కాదు" అనే క్రియావిశేషణం (לֹא, *lo'*) క్రియ నిషేధించబడినది అని ధృడంగా ఒత్తిడి చేయును. అయితే, ప్రతికూల ఆజ్ఞలు వారి అనుకూల ప్రతిరూపాలను సూచించును. ఉదాహరణకు, ఒక అబద్ధ సాక్ష్యము చెప్పుటను నిషేధించుట ఒకడు వ్యక్తిగతంగా సత్యము మరియు నిజాయితీ కలిగియుండాలి అని సలహానిచ్చును.

ఆ పది ఆజ్ఞలు క్రమముగా రెండు రాతి పలకలపై భద్రపరచబడి మరియు మందసములో (34:28; ద్వితీ. 10:1-5), దేవునికి మరియు ఆయన మాటకు ఉన్న దగ్గరి సంబంధమునకు గుర్తుగా వుంచబడెను. మందసములో ఈ పలకలు ఉండుట ప్రజలకు నిబంధనకు వారు కలిగియుండవలసిన నిబద్ధతను కూడా గుర్తుచేయును. ద్వితీ. 5లో, ఆ పది ఆజ్ఞలు కొద్ది వ్యత్యాసముతో మరలా చెప్పబడినవి. ఆ వాక్య భాగములో, ఆ మాటలు వాగ్దాన దేశములోనికి వెళ్లుటకు సిద్ధముగా నున్న ఒక క్రొత్త తరముతో చెప్పబడినవి; ఆ ఇశ్రాయేలీయులు నిబంధనను వారి స్వంత దానిగా అంగీకరించుటకు సవాలుచేయబడిరి.

## శాసనోద్దేశ వివరణము (20:1, 2)

**[1]దేవుడు ఈ ఆజ్ఞలన్నియు వివరించి చెప్పెను. - [2]నీ దేవుడనైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని.**

**వచనములు 1, 2.** పది ఆజ్ఞలు ధర్మశాస్త్రము ఇచ్చిన వానిని గుర్తిస్తూ ముందుమాటతో ఒక ప్రకటన చేయబడెను: **దేవుడు ఈ ఆజ్ఞలన్నియు వివరించి చెప్పెను.** ధర్మశాస్త్రము దేవుడు ఎవరు మరియు ఆయన ఇశ్రాయేలుకు ఏమి చేసెను

అని పేర్కొనుచు ప్రారంభించబడెను - **నీ దేవుడనైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని.** దేవుడు విధేయతను ఆజ్ఞాపించుటకు హక్కు మాత్రమే కాదు గాని, ఆయన వారిని ఐగుప్తు నుండి విడిపించెను కనుక ఆయనకు లోబడియుండవలెనని కోరుచున్నాడని ఇశ్రాయేలీయులు ముఖ్యముగా జ్ఞాపకముంచుకొనవలెను.

ఈ వచనములు దేవునికి మరియు ఇశ్రాయేలీయులకు మధ్య సాధారణముగా ఉన్న నిబంధన ప్రారంభమును ప్రతిబింబించును. ఇది ఒక ప్రభువు - సామంత నిబంధన, అలాంటిది ఒక గొప్ప శక్తిగల అధికారికి మరియు బలహీన అధికారికి మధ్యనున్నటు వంటిది (ఉదాహరణకు, ఒక సార్వభౌమ రాజు మరియు ఒక పనిచేయు రాజు). ఈ ఒప్పందాలలో, ఆ గొప్ప రాజు (1) తానెవరో స్థాపించుకొనును, (2) శక్తిహీనులకు అతడు ఏమి చేసెనో లేక ఏమి చేస్తాడో చూపించును, మరియు అప్పుడు (3) ఏ ఆజ్ఞలు లేక నియమాలు ఆ సామంత రాజ్యము పాటించాలో వివరించును. (అధిక సమాచారం కొరకు, చూడండి *అనుబంధం: నిబంధన.*)

## 1. దేవునికి విధేయత (20:3)

**[3]నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు.**

**వచనము 3.** పది ఆజ్ఞలలో మొదటిది ఇశ్రాయేలీయులు యెహోవా దేవునికి వారి పూర్తి విధేయతను చూపుట అవసరం. వారు చుట్టూ ఉన్న అన్య ప్రపంచము **ఇతర దేవతల** ఉనికిని నమ్మెను. ఈ ఆజ్ఞ వారు ఒకే నిజమైన దేవునిని ఆరాధించాలని కోరెను. ఇది ఇతర దేవతల ఉనికి అసంబద్ధమైనదిగా చేసెను. ఇశ్రాయేలు యెహోవా దేవునిని మరియు ఆయననే ఆరాధించాలి. వారు కేవలం యాపే కు మాత్రమే విధేయులై యుండాలి (ద్వితీ. 6:4, 5 చూడండి).

**నేను తప్ప** అనే పదము (עַל־פָּנָיַ, *'al panay*) "నా ముఖము యెదుట" అని అక్షరాల అనువదించవచ్చు. ఈ పదమునకు ఆ సందర్భము పై ఆధారపడి అనేక రకములైన అర్థము వచ్చును. అది ఈ కింది విధములుగా అన్వయించవచ్చు: (1) "నా ఎదుట" లేక "నా సన్నిధిలో," (2) "నా ముందు" లేక "నా ప్రాధాన్యతలో," (3) "నాతో కలిపి" లేక "నా ప్రక్కన," మరియు (4) "నా ఎదురుగా" లేక "నాకు ధిక్కరించి."[6] "నాయెదుట" అనే అనువాదము కొందరు పాఠకులను తప్పుడు అభిప్రాయములో ఇచ్చును. పూర్వాపరాలుగా, ఆయనను మొదటిగా వుంచినంతకాలం వారు ఇతర దేవతలను ఆరాధించుట అంగీకారము అని యెహోవా చెప్పుట లేదు. కాని, ఆయన వారి ఖచ్చితమైన విధేయతను అడుగుచుండెను. ఆ ప్రజలు ఆయన తప్ప వేరొక దేవుడు కలిగియుండకూడదు (20:4-6). ఈ వాస్తవము చాలా తర్జుమాలలో బయటకు తేబడెను (NJB; NEB; TEV; CEV; NCV; LB; NLT).

ఈ ఆజ్ఞ మొదటిగా వచ్చెను ఎందుకనగా ఇది చాలా ప్రధానమైనది. సృష్టిపట్ల, ఇతర మనుష్యులపట్ల, మరియు తన పట్ల ఉన్న వైఖరి అతడు దేవుని గూర్చి ఏమి

ఆలోచించుచున్నాడు అనే దానిపై ఆధారపడును. ఇది రోమా. 1:18-32లో చాలా స్పష్టముగా, ఎక్కడైతే పౌలు అన్యజనులను భయంకరమైన పాపముల గూర్చి నిందించెనో, వివరించబడెను. అలాంటి భయంకర విషయాలైన నేరాలను ఎందుకు చేసెను? ఎందుకనగా - వారు ఒక నిజమైన దేవునిని, సృష్టికర్తను ఆరాధించుట మానివేసి, సృష్టించబడిన వాటిని ఆరాధించుచుండిరి.

## 2. విగ్రహారాధన (20:4-6)

**[4]పైన ఆకాశమందేగాని క్రింది భూమియందేగాని భూమిక్రింది నీళ్లయందేగాని యుండు దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు వాటిని పూజింపకూడదు. [5]ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు, తండ్రుల దోషమును కుమారులమీదికి రప్పించుచు [6]నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యితరములవరకు కరుణించువాడనై యున్నాను.**

**వచనము 4.** రెండవఆజ్ఞ విగ్రహములను చేసికొనుట మరియు ఆరాధించుటను నిషేధించెను. **విగ్రహము** అనే పదము (פֶּסֶל, *pesel*) "నరుకు" లేక "కోయు" (פָּסַל, *pasal*) అనే క్రియకు సంబంధించినది. అది సాధారణముగా చెక్క నుండి లేక రాయి నుండి కోయబడిన విగ్రహమును సూచించును, అది, ఒక "చెక్కబడిన విగ్రహము" (KJV).[7] అంతేకాకుండా, **దేని రూపమునయినను** అనే పదము ఏ విగ్రహమయినా వాక్యములో లేనిది, ఒక కరిగించబడిన విగ్రహము లాంటిది కూడా కలుపును (20:23; 34:17; ద్వితీ. 27:15 చూడుము).

ఈ నిషేధము ఈ వివరణ ద్వారా ఇంకా స్పష్టము చేయబడినది: **పైన ఆకాశమందేగాని క్రింది భూమియందేగాని భూమిక్రింద నీళ్లయందేగాని.** ఈ భాష సృష్టిని గుర్తుచేయును, మానవునికి "ఆకాశ పక్షులు," "సముద్రపు చేపలు," మరియు "భూమిమీద ప్రాకు ప్రతి జీవి" పై యేలుటకు అధికారము ఇవ్వబడెను (ఆది. 1:26, 28). ఈ సారాంశములో, దేవుడు ఇశ్రాయేలీయులను సృష్టించబడిన ఏ జీవినైనను ప్రదర్శిస్తూ ఏ విగ్రహమును రూపింపకూడదని ఆజ్ఞాపించెను (ద్వితీ. 4:15-19).

**వచనము 5.** ప్రజలు విగ్రహములను చేసుకొనకూడదు, పూజింపకూడదు సేవింపకూడదు. ఈ ఆజ్ఞ యొక్క ప్రాథమిక గురి దేవుడు ఒక పదార్థం కాదని ప్రజలకు గుర్తుచేయాలి: ఆయనను చూడలేము, తాకలేము, తూచలేము, లేక కొలవలేము. దేవుడు ఆత్మ (యోహాను 4:24) మరియు, అందువలన, శారీరకమైన దేనితోను సరిపోల్చలేము. ఇశ్రాయేలీయులు విగ్రహముగా ప్రదర్శించబడిన దేనిని పూజింపకూడదు, లేక **యెహోవా** [వారి] **దేవుని** యొక్క విగ్రహములను చేసుకొనకూడదు. James Burton Coffman వ్రాసెను,

> దీనికి కారణములు లోతైనవి. దాని స్వంత గుణమును బట్టి ఏ మతపరమైన విగ్రహమైనా *అబద్ధము*, చెప్పిన దానిని సూచించు *అబద్ధపు* ప్రదర్శనయై ఉన్నది.

> పదార్థముగా ఉండేదేదైనా ఆధ్యాత్మికమైన దేనినైనా ఎలాగు ప్రాతినిధ్యం వహించగలదు? నిస్సహాయంగా ఉండేది శాశ్వత సర్వశక్తికలిగినదిగా ఎలా ఉండును? నశించిపోయేది శాశ్వత జీవమును ఎలా చూపును? అజ్ఞానముతో వున్నది సర్వజ్ఞానిగా ఎలా చూపించగలదు? మాట్లాడలేనిది, అనుభవించలేనిది, గ్రుడ్డిది, మరియు మృతమైనది దేవుని ప్రాముఖ్య సత్యములను మరియు పరిశుద్ధ మతమును ఎలా చూపించగలదు?[8]

పురాతన ప్రపంచములో దేవునిని ఒక పదార్థముగా కాకుండా అర్థము చేసికొనుట ఏకైకము. ప్రజలు వారికివారే సృష్టించిన రూపములు, లేక విగ్రహముల ద్వారా చూపబడే చాలా దేవతలను, ఆరాధించెను. సంవత్సరములు గతించగా, ఇశ్రాయేలు తరచుగా ఈ రెండవ ఆజ్ఞలో తప్పిపోయెను, వారు మొదట చేసినట్టుగా, రూపములను చేసికొని మరియు పూజించిరి (అధ్యా. 32 చూడుము). అయితే, ఆజ్ఞ పూర్తిగా వదలలేదు, కొంతమంది, జీవముగల వాటి చిత్రాలను లేక విగ్రహాలను తయారుచేసెనని ముగించెను (25:18-20 చూడుము). అంతేకాకుండా, *రూపాలను ఆరాధించే వస్తువులుగా* నిషేధించును.[9]

రెండవ ఆజ్ఞకు లోబడుటకు దేవుడు ఒక కారణమిచ్చి, తననుతాను వర్ణించుకొనుటకు ఒక **రోషముగల దేవునిగా** మరియు **నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు, తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించెదను.** ఈ ప్రకటన నుండి రెండు ప్రశ్నలు తలెత్తును.

1. ఏ భావములో దేవుడు ఒక "రోషము కలిగిన దేవుడు"? "రోషము" అనే మాట (קַנָּא, *qanna'*) ఒక విశేషణం అది కేవలం దేవునిని వర్ణించుటకు మాత్రమే వాడబడును (20:5; 34:14; ద్వితీ. 4:24; 5:9; 6:15). దాని అర్థము ఆయన ప్రత్యర్థులను భరించడు. ఆయనొక్కడే పూజింపబడాలి, మరియు పాపమును శిక్షించుట ద్వారా ద్రోహము యెడల అసహనమును ప్రదర్శించును. బహుశా దేవుడు ఒక రోషము కలిగిన భర్తగా ఎవరైతే తన భార్యకు శ్రేష్ఠమైనది కోరుకొని మరియు తనను ఇతర మగవారితో పంచుకొనుటకు తిరస్కరించినట్లుగా ఉండవచ్చు. Warren W. Wiersbe వివరించెను,

> తల్లితండ్రులు వారి పిల్లలపై మరియు భార్యాభర్తలు వారి భాగస్వామిపై రోషము కలిగి యున్నట్లు, అలాగే దేవుడు తన ప్రియమైన వారిపై రోషము గలిగి మరియు పోటీని భరించడు (జెకర్యా 1:14; 8:2). లేఖనములు విగ్రహారాధనను వ్యభిచారమునకు మరియు జారత్వమునకు సమాంతరముగా పోల్చును (హోషేయ 1-3; యిర్మీయా 2-3; యెహెజ్కేలు 16; 23; యాకోబు 4:4-5). దేవుడు తన ప్రజల యొక్క విశిష్ఠ ప్రేమను కోరుకొనును మరియు పొందుటకు అర్హుడు (నిర్గమకాండము 34:14; ద్వితీయోపదేశాకాండము 4:24; 5:9; 6:15).[10]

2. తమ తండ్రుల పాపముల నిమిత్తము దేవుడు పిల్లలను శిక్షించడం అనేది ఎంత వరకు సమంజసం? నిజముగా దేవుడు ఇలా చేస్తాడు అనేది ఒక సమస్యను లేపుతుంది, ఎందుకంటే ద్వితీ. 24:16 మరియు యెహె. 18:20 ప్రకారము తమ

తండ్రుల పాపముల నిమిత్తము పిల్లలు శిక్షింపబడకూడదు. ఇక్కడ వైరుధ్యము ఏది లేదు ఎందుకంటే నిర్గమ. 20:5 పాపముల యొక్క పరిణామాలు గూర్చి మాట్లాడుతుంది కాని అపరాధభావనను గూర్చి అయితే కాదు. ఒక తండ్రి యొక్క పాపము తన కుటుంబముపై మూడు లేదా నాలుగు తరముల వరకు ప్రతికూలముగా పనిచేయవచ్చు. తన యొక్క చెడు అలవాట్లను తన పిల్లలు నేర్చుకొని ఆయన వలె మారే అవకాశములు ఉన్నాయి; అప్పుడు వారు తమ సొంత పాపముల నిమిత్తము బాధపడుదురు.

దీనికి తోడు, పాపము యొక్క పరిణామాలు - విచారము, బలహీనత, అవమానము, నిర్బంధించబడటం, మరియు ముందుగానే మరణమును పొందటం - ఇవన్నియు ఒక కుటుంబమునకు చాలా తరముల వరకు ఒక మాయని మచ్చలా ఉంటాయి. ఇశ్రాయేలీయులు బంధకములోనికి తీసికొనబడినప్పుడు వారు ఈ సత్యాన్ని వెల్లడి చేశారు. అపరాధులైన తమ తండ్రులను బట్టి తండ్రుల తండ్రులను బట్టి అమాయకపు పిల్లలు దేశాన్ని వీడి సదరు పరిణామాలను అనుభవింపవలసి వచ్చింది. నేటి కాలపు చదువరుల కంటే ఆనాటి ఇశ్రాయేలీయులు ఒకని తల్లిదండ్రుల పాపముల నిమిత్తము ఆ పిల్లలు శిక్షింపబడతారు అనే విషయాన్ని బాగుగా అర్థం చేసికొని ఉంటారు, ఎందుకంటే సామూహిక అపరాధము అనే విషయాన్ని వారు బాగా తెలిసికొనినవారు. W. H. Gispen చెప్పినట్లుగా, "ఈవిధమైన హాని నేపథ్యంలో మనము గుర్తుంచుకొనవలసిన విషయం ఏమంటే ప్రాచీన పశ్చిమ ఆసియాలో ఒక వ్యక్తికి మరియు ఆ గోత్రము యొక్క, ఆ దేశము యొక్క, మరియు ఆ కుటుంబము యొక్క విశాల నేపథ్యానికి ఉన్న బంధము అనేది నేటి కాలములో ప్రజల మధ్యలో జరుతుగున్నట్లుగా అంతగా విలువ తక్కువగా చూడబడేది కాదు."[11]

**వచనము 6.** తను విధించు శిక్షను దేవుడు తన కనికరముతో వేరుగా చూపాడు. విగ్రహములను ఆరాధించుట ద్వారా తన పట్ల "ద్వేషాన్ని [వెల్లడిపరచినవారు]" మూడు లేదా నాలుగు తరముల వరకు బాధింపబడతారు (20:5). దీనికి విరుద్ధముగా, [ఆయనను] **ప్రేమించి** [ఆయన] **ఆజ్ఞలను గైకొనువారిని వెయ్యితరములవరకు కరుణించు**వాడిగా ఉన్నాడు. "కరుణ" (חֶסֶד, *chesed*) అనే పదమును గూర్చి W. H. Gispen ఈ విధంగా చెప్పాడు,

> ఒకరికి అసలు ఏవిధమైన హక్కుగాని అధికారముగాని లేని కరుణను గూర్చి ఈ పదము చెప్పుటలేదు; ఈ విధంగా చెప్పాలంటే హెబ్రీ భాషలో వేరొక పదము ఉంది. కాని ఇక్కడ ఇవ్వబడిన పదము అనుబంధములను ఆధారము చేసికొని ఒకరికి చూపబడే మంచితనము, దయాగుణము, కరుణ అనే గుణాలను సూచించేదిగా ఉంది . . . దేవుడు మరియు ఇశ్రాయేలు విషయానికొస్తే ఇది నిబంధన అనే అంశంపై ఆధారపడి ఉంది: కర్తవ్యాలు మరియు బాధ్యతలు అనువాటి యొక్క పరస్పర సంబంధంపై ఆధారపడి ఉన్న, మరియు దేవుడు మానవుని తనతో పెనవేసుకొనే ప్రేమే ఈ నిబంధన ప్రేమ.[12]

మూడు లేదా నాలుగు తరములకును అలాగే "వెయ్యి తరముల"కు ఉన్న వ్యత్యాసము ఏమి తెలుపుతుందంటే దేవుడు అవిధేయతను శిక్షించే దానికంటే వెయ్యి రెట్లు

విధేయతకు ప్రతిఫలాన్ని ఇస్తాడు.

### 3. దైవికమైన నామము (20:7)

**[7]నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు; యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరింపువానిని నిర్దోషిగా ఎంచడు.**

**వచనము 7.** మూడవ ఆజ్ఞ **దేవుని** పరిశుద్ధతను పరిరక్షించింది. ఇది తప్పుడు ప్రమాణాలలో దేవుని **నామమును** ఉపయోగించకుండా చేయుటకు, ఆయన నామముపై ప్రమాణము చేసి ప్రమాణమును కొట్టివేయువారిగా చేయకుండా ఇశ్రాయేలీయులను ఉంచెను (లేవీయ. 19:12). అయితే, ప్రమాణము చేయుటలో లేదా శాపములు పలుకునప్పుడు దేవుని నామమును ఉపయోగించుటను ఇది నిషేదిస్తుంది. **తీసుకొను** అని అనువదించబడిన హెబ్రీ పదము యొక్క అర్ధము "తీసుకొనుట" లేక "ప్రమాణము చేయుట" అని, మరియు ఇక్కడ "'పెదవులపై తీసుకొనుట' అనగా దైవిక నామమును 'ఉచ్చరించుటకు' శబ్దలోపముగా ఉంది" అని Nahum M. Sarna గుర్తించాడు.[13] **వ్యర్థం** (שָׁוְא, *shaw$^e$'*) అను పదము యొక్క అర్థం "తప్పుగా" అని కావచ్చు; "ఈ సందేహాలు న్యాయ వ్యాజ్యాలలో అసత్యము, అబద్ధ ప్రమాణాలు, మరియు అనవసరముగా లేక వ్యర్థముగా దేవుని నామమును ఉచ్చరించుట యొక్క నిషేధమునకు అనుమతి ఇస్తాయి."[14]

యూదులు తరువాత తమ చరిత్రలో "యెహోవా" (יהוה, *YHWH*), అను దేవుని నామమును ఉచ్చరింపలేనంత పరిశుద్ధమైనదని నమ్మడం ప్రారంభించారు. అందువలన, యూదులు దేవుని నామమును ఉపయోగించుటకు నిరాకరించిరి. "యెహోవా," అను పేరు పిలచుటకు బదులుగా మరొక పదమును వారు ఉపయోగించారు. ఉదాహరణకు, "పరలోకము" అను పదము "యెహోవా"కు లేదా "దేవుడు"కు బదులుగా ఉపయోగించబడవచ్చు. వారు వాక్యభాగామును గట్టిగా చదివినప్పుడు, వారు "Adonai" (אֲדֹנָי, *'Adonay*), అను నామమును వాడేవారు అనగా "నా ప్రభువు," "యెహోవా" అను పేరునకు బదులుగా వాడేవారు. ఆంగ్ల లేఖనములు సాధారణంగా ఈ పద్ధతిని అనుసరిస్తాయి, అవి వ్యక్తిగత పేర్లను సామాన్యముగా వ్రాయు విధానమును విడచి, "యెహోవా" అను మాటను **Lord** అని చిన్న అక్షరాలతో అనువదిస్తాయి. అయితే, తన వ్యక్తిగత పేరు ఉచ్చరించకుండా ఉండాలని దేవుడు ఆశించి యుండకపోవచ్చు.

### 4. విశ్రాంతి దినము (20:8-11)

**[8]విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము. [9]ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. [10]ఏడవ దినమున నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతిదినము. దానిలో నీవైనాను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను నీ పశువైనను నీ యిండ్లలో నున్న**

**పరదేశియైనను ఏ పనియు చేయకూడదు. [11]ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవ దినమున విశ్రమించెను; అందుచేత యెహోవా విశ్రాంతిదినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను.**

**వచనములు 8-10. దేవుని** ఘనపరచుటకు మరియు ఇశ్రాయేలీయులకు ప్రయోజనం కలిగించుట కొరకు నాలుగవ ఆజ్ఞ ఇయ్యబడెను. **విశ్రాంతి దినమున పనిచేయుట వలన** రాజ్యముకు అన్నియు సమకూర్చు దేవుని శక్తియందు విశ్వాసమును ఇశ్రాయేలీయులు ప్రకటించారు. ఉదాహరణకు, మన్నాను సమకూర్చుకొను సందర్భంలో, ఆరు దినములు ఆహారమును దయచేసి ఏడవ దినమందు వారు విశ్రాంతి పొందుకొను విధంగా చేసిన దేవునియందు వారు విశ్వాసమును కనుపరచిరి (16:22-26). **ఆరు దినముల** సృష్టిని జ్ఞాపకం చేసికొని, విశ్రాంతి దినము దేవుని సార్వభౌమత్వముపై మరియు జీవితమును కొనసాగించే దానిపై ప్రతిబింబిస్తుంది (ఆది. 2:1-3). ఇశ్రాయేలీయులు ప్రయోజనము పొందారు, అనగా వారికిని మరియు ఇశ్రాయేలీయుల కొరకు పనిచేయు వారికిని విశ్రాంతి దినము విశ్రాంతిని మరియు ఆహ్లాదమును కలిగించింది (23:12; మార్కు 2:27 చూడండి).

విశ్రాంతి దినమును ఎలా **జ్ఞాపకముంచుకోవాలి**? విశ్రాంతి దినమందు ఆరాధించుటను గూర్చి పది ఆజ్ఞలు ఏమియు చెప్పలేదు. విశ్రాంతి దిన ఆరాధనా మరియు సమాజమందిరము హాజరు ఇశ్రాయేలు చరిత్రలో తరువాత వచ్చాయి. బదులుగా, విశ్రాంతి దినము అనునది ఒక రోజు విశ్రాంతి దినమే కాని ఖచ్చితంగా ఆరాధన దినం కాదు. [విశ్రాంతి దినమును] **పరిశుద్ధంగా ఉంచడం అంటే** దేవుని ప్రజలు ఆరాధించాలని కోరడం లేదు, ఎందుకంటే קָדַשׁ (*qadash*) అను పదమునకు అర్థము "వేరుచేయు," "ప్రత్యేకంగా (వేరుగా)ఉంచు," లేదా "పరిశుద్ధపరచబడుట." ఒకడు ఒక ఆరాధన దినమును "ప్రత్యేకపరచినట్లు" విశ్రాంతి కొరకు కూడా ఒక దినమును "ప్రత్యేకపరచవచ్చు."

**వచనము 11.** విశ్రాంతి దినమును పాటించుటకు ఈ వాక్యభాగంలో ఇవ్వబడిన కారణం ఏంటంటే దేవుడు ప్రతిదీ **ఆరు దినములలో చేసి** మరియు **ఏడవ దినమందు విశ్రాంతి పొందెను**. అందుచేత దేవుడు **విశ్రాంతి దినమును ఆశీర్వదించి మరియు పరిశుద్ధతపరచెను** (ఆది. 2:1-3 చూడండి). ఇశ్రాయేలీయుల యొక్క తరువాత తరమువారికి, విశ్రాంతి దినమును పాటించుటకు మరొక కారణమును ఇచ్చెను: "నీవు ఐగుప్తుదేశమందు దాసుడవైయున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలము చేతను చాచిన చేతిచేతను నిన్ను అక్కడనుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" (ద్వితీ. 5:15).

దేవుని నైపుణ్య శక్తిని బట్టి మాత్రమే విశ్రాంతి దినమును ఆచరించడం కాదుగాని, దేవుని విమోచన శక్తిని బట్టి కూడా ఆచరించాలి. రెండు సంఘటనలు అనగా - సృష్టి మరియు విమోచన యొక్క ప్రాముఖ్యత ఈ ఆజ్ఞను పాటించుటకు ఇశ్రాయేలీయులను నడిపించింది. తరువాత సంవత్సరాలలో, దేనికన్నా విశ్రాంతి దినమును తప్పక

పాటించాలనే యూదుల ఒత్తిడి, ఇతర ప్రజల నుండి వారిని వేరుపరచింది.

క్రైస్తవులు ఇంకను విశ్రాంతి దినమును పాటించాలని చెప్పే కొంతమంది ఈ వాక్యభాగమును ఉపయోగించి ఇది సృష్టిలో ఇవ్వబడిన శాశ్వత ఆజ్ఞ, ముందుగా పది ఆజ్ఞలలో చెప్పబడింది, మరియు ఎన్నడు వెనుకకు తీసుకొనబడలేదు. "విశ్రాంతి దినమును జ్ఞాపకముంచుకొనుము" అని చెప్పబడిన పద సమూహము అప్పటికే విశ్రాంతి దినము పాటించబడుతుందనే అర్థాన్ని ఇస్తుంది. తదుపరి, సృష్టి కథనము వెంటనే విశ్రాంతి దినమును దీవించి మరియు పరిశుద్ధపరచానని దేవుడు చెప్పాడు గనుక (ఆది. 2:3), *ఆ సమయంలో* దేవుడు విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ప్రత్యేకపరచి మరియు ప్రజలు దానిని పాటించాలని కోరుకొనెను.

ఈ వాదనకు ప్రతిస్పందనగా, ఐదు సత్యాలు గ్రహించాలి. (1) కనీసం ఒక విశ్రాంతి దినము - బహుశా ఇంకా ఎక్కువ - అప్పటికే పాటించబడుతు ఉన్నది (16:22-30). "విశ్రాంతి దినమును జ్ఞాపకముంచుకొనుము" అని దేవుడు చెప్పినప్పుడు ఆయన దీనిని గూర్చి చెప్పియుండవచ్చు. (2) సృష్టికి సంబంధించి విశ్రాంతి దినమును పవిత్రపరచడమును గూర్చి చెప్పబడిన మాట ఖచ్చితంగా దేవుడు సృష్టిని చేయు సమయంలో ఏడవ దినమును దీవించెను అని మాత్రమే చెప్పలేము; దేవుడు *అప్పుడు* విశ్రాంతి పొందెను, దేవుడు ఇప్పుడు (*నిర్గమకాండమును వ్రాయు సమయంలో*) *విశ్రాంతి దినమును దీవించి మరియు పరిశుద్ధపరుస్తున్నాడు.* (3) "*జ్ఞాపకముచేసుకొనుము*" *అను పదము ఇశ్రాయేలీయులు ఇంతకు ముందు విశ్రాంతి దినమును పాటిస్తున్నారు అని ఖచ్చితంగా చెప్పదు.*[15] "జ్ఞాపకం చేసుకో" *అంటే* "*నమ్మకంగా పాటించు*" *అని అర్థం.*[16] (4) *నిర్గమకాండము వరకు ఎవరైనా విశ్రాంతి దినమును పాటించినట్లు బైబిల్ రుజువులు ఏమీ లేవు.* (5) *పితరుల కాలంలో విశ్రాంతి దినము పాటించబడినప్పటికీ కూడా, నేడు విశ్రాంతి దినమును పాటించాలని కోరదు.*

## 5. తల్లిదండ్రులను గౌరవించుట (20:12)

**[12]నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము.**

**వచనము 12.** తల్లిదండ్రులకు మరియు పిల్లలకు మధ్య సరైన సంబంధమును ఏర్పాటు చేయుటకు ఈ ఐదవ ఆజ్ఞ ఇవ్వబడింది. పిల్లలు **తల్లిని** మరియు **తండ్రిని** సన్మానించాలి. ఒకడు తన తల్లిని మరియు తండ్రిని ఈ విధంగా సన్మానిస్తాడు (1) వారికి విధేయత చూపుట ద్వార (ద్వితీ. 21:18-20); (2) వారితో మరియు వారి గురించి గౌరవంగా మాట్లాడడం (లేవీయ. 19:3); (3) వారిని దూషించక మరియు కొట్టకుండా ఉండుట (నిర్గమ. 21:15, 17; లేవీయ. 20:9); మరియు (4) వారి అవసరాలను తాము తీర్చుకోలేని పరిస్థితిలో అవసరాలను తీర్చుట. తల్లిదండ్రులను "సన్మానించుట" అనేది ఈ నాలుగవ అర్థమును కలిగియుంటుందని మార్కు 7:9-13లో యేసు చెప్పాడు. వారి తల్లిదండ్రులతో పంచుకోవలసిన ఆర్థిక వనరులు

"corban," లేదా "దేవార్పితము" అని చెప్పుచు తల్లిదండ్రులను సన్మానించుమని చెప్పబడిన ఆజ్ఞను తిరస్కరించినందున దేవుడు పరిసయ్యులను ఖండించాడు.

ఈ ఆజ్ఞను పౌలు క్రైస్తవులకు అన్వయించాడు. ఎఫెసీ. 6:1-3 ఈ విధంగా చెప్తుంది, "పిల్లలారా ప్రభువునందు మీ తల్లిదండ్రులులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తల్లిని తండ్రిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు" (ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది).

పౌలు ఈ ఆజ్ఞను "వాగ్దానముతో కూడిన . . . మొదటి ఆజ్ఞగా" గుర్తించాడు. ఇతర ఆజ్ఞలు విధేయత చూపుటకు గల కారణాలను ఇచ్చాయి, కాని ఈ ఆజ్ఞ వాగ్దానము కలిగియుండుటలో మొదటిది. నిర్గమ. 20:12 ప్రకారంగా, **నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము.** ఇశ్రాయేలీయులకు, వారు తల్లిదండ్రులను సన్మానిస్తే కనాను దేశములో నివశించుటను వారు కొనసాగించవచ్చని అర్థము.[17] తల్లిదండ్రులను సన్మానించువారు దేవునికి మరియు వారి పితరులకు మధ్యనున్న నిబంధనను పాటించి దేవుని యెదుట నుండి మళ్లిపోరు. చివరకు, దేవుడు ఇశ్రాయేలీయులకు అనుగ్రహించిన దేశమునకు తీసుకొనిపోబడ్డారు ఎందుకంటే తల్లిదండ్రుల ద్వారా బోధించబడి ధర్మశాస్త్రము కోరినదానిని వారు పాటించలేకపోయిరి గనుక.

పౌలు అనుసరించిన వాగ్దానము తల్లిదండ్రులను సన్మానించిన పిల్లలు ఉత్తమ జీవితమును జీవిస్తారని ("సమస్తము మంచిగా ఉంటుంది") మరియు దీర్ఘాయుష్మంతుడవగుదువు ("భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు") అని సూచిస్తుంది. పౌలు మాట సులభంగా కొట్టిపేయబడేది కాదు గాని అది ఒక సూత్రము. సాధారణంగా, తమ తల్లిదండ్రులను సన్మానించి మరియు వారి అధికారమునకు లోబడు బిడ్డలు ఉన్నతమైన జీవితము కలిగి మరియు విధేయత చూపని వారికంటే ఎక్కువ కాలం బ్రతుకుతారు.[18]

## 6. నరహత్య (20:13)

**[13]నరహత్య చేయకూడదు.**

**వచనము 13.** మానవ జీవితముకు భద్రత కలిగించుటకు ఈ ఆరవ ఆజ్ఞ ఇవ్వబడింది. ఈ వచనము యొక్క సుపరిచిత KJV అనువాదం "నీవు చంపకూడదు," అయితే NASB ఆజ్ఞ అను ఆలోచనకు మంచి ప్రతినిధిగా ఉంది.[19] **హత్య** అను పదమునకు హెబ్రీ పదము ఏంటంటే רָצַח (*ratsach*). ఈ సందర్భంలో "హత్య" అను మాట చాలా సాధారణం, ఇది ధర్మశాస్త్రం హత్య చేయుటను తిరస్కరిస్తుందను సత్యం ద్వారా రుజువు చేయబడుతుంది. ఉదాహరణకు, ధర్మశాస్త్రం అనేది మరణశిక్షార్థమైన నేరమును మరియు యుద్ధమును నియంత్రిస్తుంది కాని నిషేధించుటలేదు. వాస్తవానికి, యుద్ధములో పోరాడమని దేవుని కొన్నిసార్లు ఇశ్రాయేలీయులను ఆజ్ఞాపించాడు (సంఖ్యా. 10:9; ద్వితీ. 20:1), మరియు కొన్ని

నేరాలకు - హత్యతో కూడా కలిపి మరణశిక్ష వేయాలని ఆయన కోరెను (నిర్గమ. 21:12; సంఖ్యా. 35:16-21, 27, 30). తదుపరి, *ratsach* అను పదము "వ్యక్తిగత శత్రువును చంపడానికి" ఉపయోగించు పదము.[20] ఆరవ ఆజ్ఞ హత్యను, అనగా ఉద్దేశపూర్వకంగా మరియు హానికరంగా మానవ జీవితమును తీసుకోవడమును నిషేధించేది.

ఈ నిషేధం, మరొకచోట చెప్పబడిన శిక్షతో కలిపి, జీవిత విలువను నొక్కి చెప్తుంది. మానవ జీవితము విలువైనది ఎందుకంటే అది దేవుని నుండి వచ్చింది గనుక. దేవుడు మానవుని తన స్వరూపమందు తన పోలికచొప్పున చేసి మరియు "జీవ వాయువును నాసికారంధ్రములలో ఊదెను" (ఆది. 1:26, 27; 2:7; 9:6).

మోషే ధర్మశాస్త్రం ద్వారా మానవ జీవిత విలువ మనకు స్పష్టమౌతుంది. ఉదాహరణకు, ఒక దొంగ జీవించే హక్కు తన బాధితునికి ఆస్తిపై ఉన్న హక్కును అధిగమిస్తుంది. ధర్మశాస్త్రం ప్రకారంగా, ఒక ఆస్తి యజమాని తనకు భంగం కలుగకుండానే ఒక దొంగను చంపినట్లయితే, ఆస్తికర్త రక్తాపరాధియగును (22:3). తదుపరి, అనుకోకుండా ఒక వ్యక్తి మరొక వ్యక్తిని చంపితే, మరణ శిక్ష విధించబడకపోయినప్పటికీ, అతడు తను చేసిన కార్యమునకు చెల్లించవలసిందే. అతడు ఆశ్రయ పురమునకు పారిపోవలెను (సంఖ్యా. 35:22-28; ద్వితీ. 19:1-10). అతడు హత్య చేయని వాడుగా చెప్పబడితే, ప్రధాన యజకుని మరణము వరకు అతడు ఆశ్రయ పురములోనే ఉండాలి. అతడు హత్య చేసిన నేరస్థుడిగా భావించబడితే, హత్య చేసినవాడిని శిక్షించుటకు కోర్టులో (సమాజము) ఆయుధముగా ఉన్న "రక్తమునకు ప్రతీకారము తీర్చుకొనువాని" ద్వారా చంపబడతాడు. ప్రక్రియ అంతా కూడా ధర్మశాస్త్రం ద్వారా జరిగించబడుతుంది; హంతకుడను న్యాయస్థానం వద్దకు తీసుకువచ్చుటకు ఇది చట్టపరమైన విధానం. సైనిక దళం మరియు పోలీసు దళం లేని ప్రజలకు, ఈ విధానం రూపొందించిన ఉత్తమ న్యాయ వ్యవస్థగా ఉంది.

## 7. వ్యభిచారము (20:14)

**14 వ్యభిచరింపకూడదు.**

**వచనము 14.** ఏడవ ఆజ్ఞ వైవాహిక సంబంధమును సంరక్షించుటకు ఇవ్వబడినది. ఈ ఆజ్ఞ **వ్యభిచారము**ను - అనగా కనీసం ఒకరైనా వివాహితులతో కూడిన అక్రమ లైంగిక సంబంధమును - నిషేధిస్తున్నది. మానవ దృక్పథములో చూస్తే, పాతనిబంధనలోని వ్యభిచారమనే పాపము ప్రధానంగా వ్యభిచరించిన వ్యక్తి యొక్క వివాహితులైన భాగస్వామికి వ్యతిరేకముగా చేయబడే ఒక పాపముగా పరిగణింపబడేది. వేరొక విధంగా చెప్పాలంటే, మరొకరి భార్యతో ఒక వ్యక్తి వ్యభిచరించినట్లయితే, ఆయన వ్యభిచరించుటకు తీసుకొనిన సదరు భార్య యొక్క భర్తకు విరోధముగా పాపము చేసినవాడు అవుతాడు.

ఆఖరుగా, వ్యభిచారము అనబడే ఈ పాపమూ దేవునికి వ్యతిరేకమైన ఒక దోషము (ఆది. 20:6; కీర్త. 51:4). పోతీఫరు యొక్క భార్య యోసేపును

వశపరచుకొనుటకు ప్రయత్నించినప్పుడు, ఆయన బదులిస్తూ, "కాబట్టి నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందును" అని అన్నాడు (ఆది. 39:9). దేవుడు ఒకరినొకరు పూర్తిచేసుకొను లింగములను సృష్టించి వివాహము అనే వ్యవస్థను స్థాపించాడు (ఆది. 2:18-25). ఒక స్త్రీని మరియు పురుషుని కలిపేవాడు ఆయనే గనుక (మత్తయి 19:6), అటువంటి ఒక నిబంధనతో కూడిన సంబంధమును మీరడం ఆయనకు అమర్యాదకరమైన విషయం.

వ్యభిచారమును నిషేధించుట ద్వారా, ఈ ఏడవ ఆజ్ఞ వివాహము యొక్క శాశ్వతత్వమునకు ఉపకరిస్తుంది. ఈ ఆజ్ఞ యొక్క ప్రాముఖ్యతను ఇశ్రాయేలీయులు అర్థం చేసికొనియున్నారు అని తెలిసికొనుటకు, దీనిని అతిక్రమించిన వారికి మరణ దండన శిక్షగా ఇవ్వబడినది (లేవీయ. 20:10; ద్వితీ. 22:22).

వివిధమైన ఆజ్ఞలు బయలుపరచబడగా, మీరు "వ్యభిచరింపకూడదు" అని కేవలము చెప్పుట కంటే కూడా దేవుడు మరి యెక్కువ చెప్పవలసి ఉంది. అనేకమైన లైంగిక సంబంధమైన పాపములను, అనగా స్వలింగ సంపర్కమును, జంతు సంపర్కమును, మరియు కుటుంబ సభ్యుల మధ్య లైంగక సంబంధములను కూడా దేవుడు నిషేధించాడు (లేవీయ. 18:6-18, 22, 23; 20:11-17, 19-21). బహుశా, ఇవన్నియు కూడా ఏడవ ఆజ్ఞకు సంబంధించినవే అనునట్లుగా ఉన్నాయి; వాస్తవంగా, ఈ పాపములను మరియు ఇటువంటి విధమైన ఇతర పాపములను కూడా ఈ ఆజ్ఞలో ఇముడ్చుటకు ఈ ఆజ్ఞ ఇవ్వబడి ఉంటుంది (1 తిమోతి 1:10 చూడండి).

## 8. దొంగిలుట (20:15)

**15దొంగిలకూడదు.**

**వచనము 15**. ఎనిమిదవ ఆజ్ఞ వ్యక్తిగత ఆస్తులను సంరక్షించేదిగా ఉంది. ఆస్తులను కలిగి ఉండుటకు వ్యక్తులకు ఈ ఆజ్ఞ హక్కును ఇస్తుంది - అనగా ఆస్తులన్నియు కూడా సమాజంగానే సొంతం చేసుకోవాలి లేదా ప్రభుత్వము మాత్రమే ఆస్తులను తీసుకోవాలి అని చెప్పే ప్రతి విధమైన ఆలోచనతో ఈ ఆజ్ఞ విభేదిస్తుంది. వ్యక్తులు తమ ఆస్తులను బట్టి అన్యాక్రాంతంగా వంచనకు గురి కాకూడదు అని ఈ ఆజ్ఞ బోధిస్తుంది. "[పాతనిబంధన] ఆస్తిని ఆ యజమానుని యొక్క 'తత్వము'నకు పొడిగింపుగా పరిగణిస్తుంది," తద్వారా "దొంగతనమునకు పాల్పడే ప్రతి విధమైన చర్య వ్యక్తిపై చేసే అతిక్రమములుగానే ఉంటాయి" అని Walter J. Harrelson అనే రచయిత అన్నాడు.[21]

వ్యక్తిగత ఆస్తి అనునది సమస్తమును కలిగియుండే దేవుడు ఇస్తున్న ఒక వరము. మరొక వ్యక్తినుండి **దొంగిలడ**మంటే దేవుని నుండి ఒకరు దొంగతనము చేసినట్లుగానే. ఏ విధమైన చర్యలను దొంగతనముగా పరిగణించాలి అనే విషయంపై కొన్ని చట్టాలు ఉన్నాయి, అలాగే దొంగతనమునకు విధించే శిక్షలు కూడా ఉన్నాయి. దొంగతనము అనునది ఎప్పటికి కూడా మరణ దండనకు తగిన నేరముగా పరిగణించబడలేదు, లేదా దొంగతనమునకు, కొన్ని మతముల యొక్క చట్టాలు

చేస్తున్నట్లుగా, వ్యక్తిని శారీరకంగా విరూపునిగా చేయాలి అని ఎక్కడ కూడా లేదు.[22]

## 9. అబద్ధ సాక్ష్యము (20:16)

**[16]నీ పొరుగువానిమీద అబద్ధసాక్ష్యము పలుకకూడదు.**

**వచనము 16.** తొమ్మిదవ ఆజ్ఞ యొక్క సందర్భం ఏంటంటే న్యాయస్థానం. న్యాయస్థానంలో అబద్ధ నేరారోపణల నుండి ప్రజలను తప్పించుటను ఈ ఆజ్ఞ సూచిస్తుంది (23:1-3 చూడండి). David R. Worley, Jr., ప్రకారంగా, ఆజ్ఞ ప్రధానంగా "మరొకరి సంక్షోభానికి హాని కలిగించే అబద్ధ సాక్ష్యంతో వ్యవహరిస్తుంది."[23] DNA నమూనాకు మరియు వ్రేలి ముద్రలు వేసే రోజులకు ముందు, నేరమునకు రుజువుగా సాక్ష్యము చెప్పబడేది. కనీసం ఇద్దరు లేదా ముగ్గురు ఉండాలి; కేవలం ఒకరి సాక్ష్యము ద్వారా మాత్రం ఒప్పించబడేవారు కాదు (ద్వితీ. 17:6; 19:15). సాక్ష్యాలు సత్యమైనవి కాకపోతే, ఫలితం అన్యాయం అవుతుంది. అబద్ధ సాక్ష్యం ఒక వ్యక్తి యొక్క ఖ్యాతిని, ఆస్తిని, మరియు జీవితాన్ని కూడా కోల్పోవడానికి కారణమౌతుంది (లేవీయ. 19:15, 16; 1 రాజులు 21:8-14; మత్తయి 26:59-61). **అబద్ధ సాక్ష్యముకు** శిక్ష అనేది ఒక వ్యక్తి పొరుగువానికి వ్యతిరేకంగా హాని చేసినదానితో సమానం (ద్వితీ. 19:16, 17).

అబద్ధ సాక్ష్యము నుండి నేరస్తుడను కాపాడుట ద్వారా న్యాయ ప్రక్రియ యొక్క సమగ్రత ఈ ఆజ్ఞ రూపొందించబడింది. నిర్గమకాండము మొదలుకొని ద్వితీయోపదేశకాండము వరకునున్న అనేక ఆజ్ఞలు ఈ నియమమును వివరించి మరియు వ్యక్తిగత పరిస్థితులకు దీనిని అన్వయిస్తుంది. న్యాయస్థానంలో అబద్ధ సాక్ష్యమును నిషేధానికి అదనంగా, అన్ని విధముల మోసపూరితమైన ప్రసంగాలను నిషేధించాలని పాత నిబంధన అంతటిలో ఈ ఆజ్ఞ యొక్క అర్థం విస్తరించబడింది (హోషేయ 4:2).[24] అన్ని నిజాలకు ఉత్పత్తి స్థానమైన మరియు అబద్ధము పలుకని దేవుని స్వభావానికి ఏ అబద్ధమైనను విరుద్ధము (యోహా. 17:17; హెబ్రీ. 6:18).

## 10. ఆశించుట (20:17)

**[17]నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు. నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింప కూడదు అని చెప్పెను.**

**వచనము 17.** పదవ ఆజ్ఞ వ్యక్తిగత హృదయానికి సంబంధించి మాట్లాడుతుంది, ఆశించడం అనేది హృదయంలోనే జరుగుతుంది. **ఆశించడం** అంటే ఒకనికి చెందనిది కావాలని కోరుకోవడం. క్రొత్త నిబంధన గ్రంథంలో, "ఆశించడం" అనేది దురాశకుసన్నిహిత సంబంధం కలిగిన పదము - అనగా ఎక్కువ మరెక్కువ సంపదను కావాలనే కోరిక, ఎప్పటికీ సంతృప్తి నివ్వని "వస్తువులు" కావలసే అభిలాష (లూకా 12:15; కొలస్సీ. 3:5).

"ఆశించడం" అను పదమును కొంతమంది ఇతరులకు చెందిన ఆస్తి కంటే ఎక్కువ సంపాదించాలనే కోరిక అని అనువదించారు. ఇతరులు కలిగియున్న దానిని పొందుకొనుటకు చేయు అన్యాయ పనులను తెలుపుటకు ఈ పదము వాడబడినదని వారి ఆలోచన.[25] అయితే, పది ఆజ్ఞలు బాహ్య చర్యలతో వ్యవహరిస్తుందే తప్ప మానవుని ఆలోచనలను లలేదా వైఖరులను గూర్చి కాదని చెప్పు ముందస్తు ఆలోచన ఆధారంగా ఉండవచ్చు. నియమము మానవుని యొక్క అంతరంగమును మరియు బాహ్య కార్యములకును సంబంధించినది చెప్పుటకు రుజువు ఈ పదవ ఆజ్ఞలో కనిపిస్తుంది, మరియు బైబిల్ అంతటిలోని ఇతర వాక్య భాగాలలో కూడా రుజువు చేయబడింది. ఆశించడం అనేది ఇతర పాపములు ఉత్పత్తి అవ్వడానికి మూలంగా ఉన్నప్పటికీ, అది స్వయంగా పాపమే (రోమా. 7:7-11).

ఆశించడం పది ఆజ్ఞలలోని అన్ని ఆజ్ఞలను ఉల్లంఘించుటకు దారితీస్తుంది అని John I. Durham చెప్పాడు. ఒక కొడుకు తనకొక సొంత మార్గం ఉండాలనే ఆకాంక్ష అతనిని తన తల్లిదండ్రులకు హాని కలిగించి మరియు అగౌరవపరచుటకు దారి తీస్తుంది (21:15, 17). బత్షెబ యెడల దావీదు యొక్క మొహం వ్యభిచారమునకు మరియు హత్యకు దారితీసింది (2 సమూ. 11; 12). నాబోతు ద్రాక్షా వనమును స్వాధీనం చేసుకోవాలనే ఆహాబు ఆశ అబద్ధ సాక్ష్యమునకు మరియు హత్యకు దారితీసింది (1 రాజులు 21). ప్రవక్తయైన ఆమోసు కాలంలో జీవించిన ఆశించే వ్యాపారస్తులు విశ్రాంతి దినమును పాటించక మరియు దొంగిలించు నేరమును చేసిరి (ఆమోసు 8:4-6). ప్రవక్తయైన యిర్మీయా కాలంలో యూదాలో నున్న దురాశ ప్రజలు అన్ని ఆజ్ఞలను దిక్కరించి, దేవునికి మరియు అతని నామమునకును పవిత్ర భక్తిని అన్యమత విగ్రహారాధన కొరకు వర్తకం చేసిరి (యిర్మీ. 7:1-15).[26]

ఆశించుటను నిషేధించుటలో, **పొరుగువారి యిల్లు** అనేది ఒక సమగ్ర పదంగా కనిపిస్తుంది, అవరోహణ క్రమంలో అనుసరించే విలువైన వస్తువులను కలిగి ఉంటుంది: అతని **భార్య, దాసుడు, దాసి, ఎద్దు** మరియు **గాడిద. నీ పొరుగువానికి చెందినదేదియు** అను పదసమూహము ప్రతిదానిని కలిగి ఉంటుంది.

## ఇశ్రాయేలీయుల స్పందన (20:18-21)

**[18]ప్రజలందరు ఆ ఉరుములు ఆ మెరుపులు ఆ బూర ధ్వనియు ఆ పర్వత ధూమమునుచూచి, భయపడి తొలగి దూరముగా నిలిచి మోషేతో ఇట్లనిరి [19]- నీవు మాతో మాటలాడుము మేము విందుము; దేవుడు మాతో మాటలాడిన యెడల మేము చనిపోవుదుము [20]అందుకు మోషే - భయపడకుడి, మిమ్ము పరీక్షించుటకును, మీరు పాపము చేయకుండునట్లు ఆయన భయము మీకు కలుగుటకును, దేవుడు వేంచేసెనని ప్రజలతో చెప్పెను. [21]ప్రజలు దూరముగా నిలిచిరి. మోషే దేవుడున్న ఆ గాఢాంధకారమునకు సమీపింపగా**

**వచనములు 18, 19.** దేవుడు పర్వతంపైన ఉన్నాడని వాక్యభాగం స్పష్టం చేస్తుంది. **ఆ ఉరుములు ఆ మెరుపులు ఆ బూర ధ్వనియు ఆ పర్వత ధూమమును**

దేవుని ఉనికిని తెలియపరుస్తున్నాయి. ప్రజల యొక్క భయము మరియు వణుకు అనేవి అర్థంవంతమైనవి మరియు తగినవి కూడా. పరిమితమైన పాప మనిషి అపరిమితమైన, పరిశుద్ధ దేవునిని ఎదుర్కొన్నప్పుడు, మానవుడు భయపడి సిగ్గుపడవలసిన అవసరం ఉంది. ఇశ్రాయేలీయుల భయం కూడా అర్థవంతమైంది ఎందుకంటే దేవుని పరిశుద్ధ ప్రసన్నత ప్రమాదకరమైనది. ఒక వ్యక్తి సిద్ధపడకుండా లేదా ఆస్తి యొక్క హద్దులను ఆపివేస్తే, దేవుని పరిశుద్ధమైన వ్యక్తికి లేదా దేవునికి సంబంధమైన పరిశుద్ధ వస్తువులను ముట్టుకుంటే అతడు తక్షణ మరణము ద్వారా ప్రతిఘటించబడతాడు. వారి భయమునకు ప్రతిఫలంగా, వారు **చనిపోకుండునట్లు దేవుని** స్థానంలో **మోషేను** మాట్లాడమని ఇశ్రాయేలీయులు కోరారు (హెబ్రీ. 12:19, 20 చూడండి).

**వచనము 20. భయపడకుము** అని **మోషే** ఇశ్రాయేలీయులకు చెప్పాడు. **మిమ్ము పరీక్షించుటకును, మీరు పాపము చేయకుండునట్లు ఆయన భయము మీకు కలుగుటకును, దేవుడు వేంచేసెను** అని కూడా చెప్పాడు. వివిధ వ్యాఖ్యానకర్తల ప్రకారంగా, దేవుడు వారి విశ్వాసమును, విధేయతను, గౌరవమును లేదా ఆయన ఏర్పరచిన హద్దులను గౌరవించుటను పరీక్షించెను.[27] ఈ పరిక్ష ద్వారా దేవుని ఆశ ఏంటంటే బహుశా తన ప్రజలను శుద్ధి చేయుటకు, ఆయన ఘనతను మరియు శక్తిని అర్థం చేసుకొని ఆయనను పొగడే మనసును అభివృద్ధి చేయుటకు. అప్పుడు వారు భయపడతారు, లేదా గౌరవిస్తారు, మరియు ఆయనకు వ్యతిరేకంగా పాపము చేయరు.

**వచనము 21. మోషే దేవునిని** కలుసుకొనుటకు పర్వతంపై అతని స్థానమునకు వెళ్లాడు. మోషే మేఘాలలో ఉండడం చూసి భయపడిన ప్రజలు వారికి మరియు అతనికి ఏమౌతుందో అని భయముతోనే వీక్షించియుండవచ్చు.

## నిబంధన గ్రంథమునకు ఉపోద్ఘాతము: ధర్మశాస్త్రమును ఇచ్చువాడు (20:22)

ధర్మశాస్త్రము యొక్క రెండవ విడత, దేవుని చేత మోషేకు కొండపైన ఇవ్వబడినది 20:22-23:33లో ఉంది, అది "నిబంధన గ్రంథము"గా సూచించబడింది (24:7). ఈ నియమాలు, కొన్నిసార్లు పండిత సాహిత్యంలో "నిబంధన కోడ్ (code)"గా చెప్పబడింది, ఇది పది ఆజ్ఞలను విస్తరించి మరియు వివరిస్తుంది.

**22యెహోవా మోషేతో ఇట్లనెను - ఇశ్రాయేలీయులతో ఈలాగు చెప్పుము - నేను ఆకాశమునుండి మీతో మాటలాడితినని మీరు గ్రహించితిరి.**

**వచనము 22.** ఈ భాగమునకు ఉపోద్ఘాతము నియమముల మూలమును ఒత్తి చెప్తుంది: **దేవుడైన** యెహోవా. ఈ నియమముల మూలము గూర్చి ఇశ్రాయేలీయులు సందేహపడకూడదు, ఎందుకంటే **నేను ఆకాశమునుండి మీతో మాటలాడితినని మీరు గ్రహించితిరని** దేవుడు చెప్పాడు గనుక. మోషేకు ధర్మశాస్త్రమును వివరంగా ఇచ్చుటకు మునుపే దేవుడు ప్రజలందరితో ఎందుకు మాట్లాడాడో ఈ ప్రకటన ఒక ఆధారమును

ఇస్తుంది: ఈ ధర్మశాస్త్రమును ఇస్తుంది ఆయనేనని వారిని ఒప్పించుటకు.

నిబంధన గ్రంథము యొక్క పూర్తి రచనా నిర్మాణ పథకమును గుర్తించడం కష్టంగా ఉన్ననూ, వ్యక్తిగత నియమాలు సమూహ నియమాలలో కూడా కనిపిస్తాయి. ప్రతి సమూహ నియమములు అదే పరిస్థితులను గూర్చి మాట్లాడుతూ పూర్తి శ్రద్ధ ఉన్నట్లు కనిపిస్తుంది.

## దేవుని ఆరాధనకు సంబంధించిన నియమాలు (20:23-26)

**23మీరు నన్ను కొలుచుచు, వెండి దేవతలనైనను బంగారు దేవతలనైనను**
**చేసికొనకూడదు. 24మంటి బలిపీఠమును నాకొరకు చేసి, దానిమీద నీ దహనబలులను**
**సమాధాన బలులను నీ గొఱ్ఱెలను నీ యెద్దులను అర్పింపవలెను. నేను నా నామమును**
**జ్ఞాపకార్థముగా నుంచు ప్రతి స్థలములోను నీయొద్దకు వచ్చి నిన్ను ఆశీర్వదించెదను.**
**25నీవు నాకు రాళ్ళతో బలిపీఠమును చేయునప్పుడు మలిచిన రాళ్ళతో దాని**
**కట్టకూడదు; దానికి నీ పనిముట్టు తగలనిచ్చిన యెడల అది అపవిత్రమగును.**
**26మరియు మరియు నా బలిపీఠముమీద నీ దిగంబరత్వము కనబడక యుండునట్లు**
**మెట్లమీదుగా దానిని ఎక్కకూడదు.**

**వచనము 23.** దేవుడు ఈ నియమాలను ఇస్తూ (21:1) పది ఆజ్ఞలను విస్తరిస్తూ, రెండవ ఆజ్ఞను కొంత భిన్న పదాలతో పునఃస్థాపించాడు (20:4): **మీరు నన్ను కొలుచుచు, వెండి దేవతలనైనను బంగారు దేవతలనైనను చేసికొనకూడదు.** ఆయన మొదటి ఆజ్ఞతో కాక రెండవ ఆజ్ఞతో ఎందుకు మొదలుపెట్టాడు? "నేను గాక" వేరొక దేవుడు నీకు ఉండకూడదు (20:3) అను దానికి సంబంధించి ఈ వాక్యభాగాములో ఉన్న పదాలు మొదటి ఆజ్ఞను జ్ఞాపకం చేస్తాయి. "నేను గాక" వేరొక దేవుళ్లను చేసుకొనుటకు ధర్మశాస్త్రం నిషేధించింది. రెండవ ఆజ్ఞ చాలా ఆచరణాత్మకమైనది, ఇశ్రాయేలీయులు ఏమి నమ్మకూడదో మరియు ఆలోచించకూడదో అని కాక వారు ఏమి చేయకూడదో అని ప్రత్యేకంగా బోధిస్తుంది. ఇది నిబంధన గ్రంథములోని నియమాలన్నిటిని ఆచరణాత్మక స్వభావంతో ఉంచుతుంది.

**వచనము 24.** ఇశ్రాయేలీయులు ఏమి చేయకూడదో సూచించిన పిమ్మట, వారేమి చేయాలో దేవుడు వివరించాడు: **భూమిమీద బలిపీఠము**ను కట్టి **దహన బలులను** మరియు **సమాధాన బలుల**ను అర్పించుమని చెప్పెను. దహన బలులకు మరియు సమాధాన బలులకు నియమాలనేవి తరువాత లేవీయకాండములో వచ్చినను, ఈ వాక్యభాగము ఇప్పటికే ఇచ్చిన బలులను సూచిస్తుంది గాని ఇంకా నియంత్రించబడలేదు. ఈ బలులు అర్పించుటకు స్థలము దేవుడు ఏర్పరచెను. ఆ స్థలాలలో ఆయన **నామము జ్ఞాపకముంచుకొనబడాలని** ఆయన కోరిక. అక్కడ ఆయన ప్రజల యొద్దకు వచ్చి వారిని **దీవిస్తాడు.**

**వచనము 25.** ఈ వాక్యభాగంలో **బలిపీఠముకు** సంబంధించిన నియమాలకు తరువాత దహన బలులకు సంబంధించిన హెచ్చరికలతో ఎటువంటి సంబంధం లేదు (27:1-8). బహుశా, దహన బలులు అర్పించు బలిపీఠమును కట్టి దానిని ప్రతిష్టించక

మునుపు ఉన్న కాల పరిమితికి ఈ ధర్మశాస్త్రం అన్వయించబడింది, కాని ఇశ్రాయేలీయులు తరచుగా తరలిపెళ్లేవారు కాబట్టి వేర్వేరు ప్రదేశాల్లో బలులను అర్పించారు కాబట్టి అరణ్యములో తిరిగిన కాలమందు కూడా ఇది అన్వయించబడుతుంది. తరువాత, బలులు అర్పించుటకు దేవుడు ఒకే స్థలమును ఏర్పాటు చేసాడు (ద్వితీ. 12:11-14 చూడండి).

ఈ ధర్మశాస్త్రం కేవలం భూసంబంధమైన బలిపీఠములను మాత్రమే కోరలేదు (20:24), ఎందుకంటే, **రాతి** బలిపీఠమును గూర్చిన నియమాలు అదనంగా చేర్చబడ్డాయి గనుక. సాధారణ రాళ్లను ఉపయోగించి ఒక బలిపీఠమును కట్టాలే తప్ప మానవుని **పరికరం** ద్వారా **మలచిన రాళ్లతో** దాని కట్టకూడదు. ఒక సలహా ఏంటంటే, ఈ పరిమితి సరళత కొరకు. “పరికరము,” חֶרֶב (*chereb*) అనువదించబడిన హెబ్రీ పదము సాధారణంగా ఆక్స్ “కత్తిని” గూర్చి వివరించుటకు ఉపయోగించబడుతుంది. ఒక కత్తి (లేదా మలచిన పరికరం) ఒక ఘర్షణకు సూచనగా చెప్పబడుతుంది, బలిపీఠం సమాధానమునకు సూచనగా చెప్పబడింది.[28] మూడవ ఆలోచన ఏంటంటే కనానీయుల నుండి ఇశ్రాయేలీయుల పద్ధతులను విడదీయుటకు ఈ నిషేదించడమైనది.[29]

**వచనము 26.** తరువాత, ఇశ్రాయేలీయులు **బలిపీఠమును మెట్లతో** కట్టకూడదు. మానవుడు మెట్లు ఎక్కుతుండగా ఆయన వస్త్రముల క్రింద కనబడకుండున్నట్లు ఈ నియమము మానవుని **దిగంబరత్వమును** కప్పుటకు ఇవ్వబడింది (28:42 చూడండి). ఈ అవసరాలు సొలొమోను దేవాలయంలో తరువాత కట్టబడిన అద్భుతమైన కట్టడాలవలె కాక (2 దిన. 4:1), ఇతర రాజ్యముల విస్తీర్ణతతో కూడిన బలిపీఠమూలవలె కాక అరణ్యములో కట్టబడిన బలిపీఠములు చిన్నవని, సాధారణ కట్టడం అని సూచిస్తుంది.

L. Daniel Hawk, చేత చెప్పబడిన మరొక అవకాశం ఏంటంటే, 20:24-46 చెప్పబడిన బలిపీఠములు వేరే రకము. బహిరంగ బలిపీఠములు ఎక్కడైనా కట్టవచ్చు మరియు రకరకాల ప్రయోజనాలకు ఉపయోగించవచ్చు అని చెప్పి ప్రత్యక్షగుడారముకు సంబంధించిన బలిపీఠములకు మరియు బహిరంగ బలిపీఠములకు మధ్య వ్యత్యాసం చూపాడు.[30] అలాటి బలిపీఠములు అబ్రాహాము, ఇస్సాకు, మరియు యాకోబు చేతనే కట్టబడ్డాయి మరియు మోషే చేత ఉపయోగించబడ్డాయి (17:14-16; 24:4-8). అదే విధంగా, ప్రత్యేక్ష గుడారము సమాప్తమైన పిమ్మట కూడా అవి ఉపయోగించబడ్డాయి, యెహోషువ (ద్వితీ. 27:5, 6; యెహో. 8:31), సౌలు (1 సమూ. 14:33-35), ఏలీయా (1 రాజులు 18:23-38) విషయాల్లో మాదిరిగా. అలాటి బలిపీఠములు దహనబలుల బలిపీఠముల వలే కాక వివిధ ప్రయోజనాలకు ఉపయోగించబడితే, వారు మోషే ధర్మశాస్త్రమును ధిక్కరించుట లేదు. ఈ అనువాదం సరైనదైతే, 20:24-26లో ఉన్న ఈ హెచ్చరికలు ఆ బహిరంగ బలిపీఠములు ఎలా కట్టాలో తెలియపరచేవి.

ఈ హెచ్చరికల యొక్క అంశం బహుశా “మీ ఆరాధనలో బహిరంగ కట్టడాలకు ప్రాముఖ్యత ఇవ్వద్దు.” వాగ్దాన భూమికి వెళ్లుటకు అరణ్య ప్రదేశములో నుండి

వెళ్తున్నారని ఇశ్రాయేలీయులు జ్ఞాపకం చేసుకోవలసిన అవసరం ఉంది. వారు అనవసరంగా విస్తృతమైన బలిపీఠములను నిర్మించడం, తాగడానికి కాదు. ప్రజల ఎక్కడుంటే అక్కడ దేవుడు ఉన్నాడు కాబట్టి ఈ నియమాలు నిబంధన గ్రంథము యొక్క ప్రారంభంలోనే తగినదిగా ఉంది అని Durham చెప్పాడు. నిర్గమకాండములో ఇది ప్రాముఖ్యమైన అంశము.[31]

## అన్వయము

### ఒక మంచి ధర్మశాస్త్రము (20:1-17)

మోషే ధర్మశాస్త్రము యొక్క మొదటి భాగమైన పది ఆజ్ఞలు ఇవ్వబడుటను 20వ అధ్యాయములో మనం చూస్తాము. దేవుడు ఇశ్రాయేలుతో చేసిన నిబంధనలో ఇవి మొదటి విధులు. ఇశ్రాయేలీయులు ఆయన ఆజ్ఞలు పాటిస్తే, వారు ఆయన పిల్లలవుతారని దేవుడు చెప్పాడు. దేవుడు ఆజ్ఞాపించినవన్ని చేస్తామని ఇశ్రాయేలు చెప్పాడు. ఇశ్రాయేలు చేయవలసిన పనులను ఇప్పుడు దేవుడు చెప్పుట ఆరంభించాడు. సీనాయి యొద్ద ఇవ్వబడిన ఆజ్ఞలు మిగిలిన ధర్మశాస్త్రమునకు ప్రతినిధులుగా మరియు పునాదులుగా ఉన్నాయి. వాటి ద్వారా ధర్మశాస్త్రమును మనం దేవుడు ఇచ్చిన విధంగా చూడవచ్చు.

*మనం ధర్మశాస్త్రమును మంచి ధర్మశాస్త్రమని ఎందుకు అనుకోవాలి?* క్రొత్త నిబంధన దృష్టిలో నుండి చూస్తే, ధర్మశాస్త్రము చెడ్డది అని మనం ఆనుకొనవచ్చు: అయితే అది ఒక ఛాయ (హెబ్రీ. 10:1), మరియు ఛాయ ఎల్లప్పుడు వాస్తవికత కంటే తక్కువగానే ఉంటుంది. పాత నిబంధన తక్కువగా ఉంది; క్రొత్తది దాని కంటే ఉత్తమమైనదిగా ఉంది (హెబ్రీ. 8:6). పాత నిబంధన లోపము కలిగినదిగా ఉంది (హెబ్రీ. 8:7). మనలను క్రీస్తు యొద్దకు నడిపించుట దాని ఉద్దేశం; మరియు క్రీస్తు వచ్చాడు కాబట్టి, ఇప్పుడు దాని ప్రభావం లేదు (గలతీ. 3:19, 23-25). అది మరణ పరిచర్యను తెచ్చింది (2 కొరింథీ. 3:7).

అదే సమయంలో, మోషే ధర్మశాస్త్రము మంచి ధర్మశాస్త్రమని క్రొత్త నిబంధన సూచిస్తుంది. అది మహిమతో వచ్చింది (2 కొరింథీ. 3:7). యూదులకు “దేవోక్తులు ఇవ్వబడెను” కాబట్టి వారికి అన్యుల కంటే ఎక్కువ ధన్యత ఉన్నది అని రోమా. 3:1, 2 చెబుతుంది. “కాబట్టి ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది, ఆజ్ఞకూడ పరిశుద్ధమైనదియు నీతిగలదియు ఉత్తమ మైనదియునై యున్నది” అని రోమా. 7:12 చెబుతుంది. క్రీస్తు మరియు ఆయన నిబంధన పాత నిబంధన కంటే శ్రేష్టమైనదని హెబ్రీ పత్రిక చూపుతుంది గాని, దాని అర్థము ధర్మశాస్త్రము “చెడ్డదని” కాదు; అయితే, అది “మంచిదని” అది సూచిస్తుంది.

యేసు తన భూలోక పరిచర్యలో ధర్మశాస్త్రమును తిరస్కరించలేదు. ఆయన ధర్మశాస్త్రము చుట్టు పుట్టిన పరంపరలను తిరస్కరించాడు. ధర్మశాస్త్రము యొక్క నైతిక అవసరతలు మంచివే. అయితే, ధర్మశాస్త్రము ఎందుకు వెనుకకు

తీసుకొనబడెను? అది మంచి ధర్మశాస్త్రమే గాని, పాపమును అది తీసివేయలేదు (గలతీ. 3:19, 22; హెబ్రీ. 10:4). ప్రజలు జీవించుటకు మంచి నియమాలు మాత్రమే వారికి అక్కర లేదు; వారికి రక్షకుడు కావాలి. అందువలనే పాత నిబంధన పరిపూర్ణం చేయబడినది మరియు క్రొత్త నిబంధన స్థాపించబడినది.

*ఏ విధముగా ధర్మశాస్త్రము మంచి ధర్మశాస్త్రము?* ధర్మశాస్త్రము యొక్క మంచితనమును చూచుట సులభము. (1) అది ఇశ్రాయేలు పట్ల దేవుని యొక్క కృపా కార్యము మీద ఆధారపడియుంది (19:3, 4; 20:1, 2). అది కేవలం ధర్మశాస్త్రము ఉండుట కొరకు ధర్మశాస్త్రము కాదు, లేక జయించిన వారి యొక్క మేలును గూర్చి పట్టించుకొని జయించినవాడు విధించిన ఆంక్షలు కాదు. (2) విధేయతకు అది తగిన కారణాలను అందిస్తుంది (చూడండి 20:12). విధేయతకు దీవెనలు మరియు అవిధేయతకు శాపములు అను వాగ్దానము కూడా ధర్మశాస్త్రములో ఉంది (లేవీయ. 26; ద్వితీ. 28). (3) అది సంపూర్ణమైనది. అది కేవలం ఇశ్రాయేలు ఆరాధనకు కొన్ని విధులను నియమించలేదు, అది అనుదిన జీవిత పరిస్థితులను శాసించింది. అలాగే అది తన నైతిక అవసరతలలో కూడా సంపూర్ణంగా ఉంది. ప్రతి విధమైన పాపము పది ఆజ్ఞలలో ఏదో ఒక విధంగా నిషేదించబడినది. (4) అది ఆలోచనలు మరియు పైకరిపై కూడా ప్రభుత్వం చేసింది. "నీ పొరుగువాని ఇల్లు ఆశింపకూడదు" అనేది పదియవ ఆజ్ఞ. ఆశించుట మనస్సులో జరిగే పని! (5) నిస్సహాయులను అది రక్షించింది: బానిసలు, క్రొత్త వారు లేక పరదేశులు, విధవరాండ్రు మరియు అనాధలు, బీదలు, మరియు అంగవైకల్యం కలవారు. (6) ప్రజలకు విరోధముగా చేసిన నేరములకు అది మరణ శిక్షను విధించింది కాని ఆస్తికి విరోధముగా చేసిన నేరములకు విధించలేదు (21:12; 22:1). ఆస్తిని దొంగిలించినా సరే మరణ శిక్షను విధించిన ఇతర పురాతన సమీప తూర్పు దేశములకు మోషే ధర్మశాస్త్రము భిన్నముగా ఉంది. (7) అది సంపూర్ణ నిష్పక్షపాతమును కోరింది. సాక్షులు నిజాయితీగా ఉండాలని న్యాయాధిపతులు పక్షపాతము చూపకూడదని నిర్గమ. 23:2, 3 సూచిస్తుంది. (8) ఒక వ్యక్తి తన విరోధితో మంచిగా వ్యవహరించాలని అది కోరింది (23:4, 5).

మోషే ధర్మశాస్త్రము మంచి ధర్మశాస్త్రము, కాని మనం మరింత శ్రేష్టమైన నియమము క్రింద జీవిస్తున్నాము. ఒకవేళ ఇశ్రాయేలీయులు తాము కలిగియున్న ధర్మశాస్త్రములో ఆనందిస్తే, క్రొత్త నిబంధనలో మనం ఇంకెంత ఆనందించాలి! క్రీస్తులో మనం కలిగియున్న శ్రేష్టమైన నియమమునకు విధేయులగుటకు ప్రయాసపడదాం.

ఇశ్రాయేలు ఎన్నడు ధర్మశాస్త్రమును పరిపూర్ణంగా పాటించలేదు. ధర్మశాస్త్రము అంతే మంచిదైనప్పటికీ, మానవులు దానిని సంపూర్ణంగా పాటించుటలో విఫలమవుతారు కాబట్టి అది వారిని రక్షించలేదు. ప్రభువు కోరిన వాటన్నిటిని చేయుటలో మనం విఫలమైనప్పటికీ మన రక్షణను సాధ్యపరచిన పూర్ణ బలియైన యేసు క్రీస్తు నందు మనం ఆనందించెదము. మనం దేవుని ఆజ్ఞలను పాటించాలి; అయినను మన రక్షణ ధర్మశాస్త్రమును పాటించుట వలన కలుగదని, మన పక్షమున అర్పింపబడిన క్రీస్తు బలి వలన కలుగుతుందని జ్ఞాపకముంచుకొందుము.

## పది ఆజ్ఞలను బోధించుట (20:1-17)

పది ఆజ్ఞలు ఒకటి లేక అనేక ప్రసంగాలకు కావలసినంత సహకారమును అందిస్తాయి. పది ఆజ్ఞలను ఒక ప్రసంగములో చెప్పవచ్చు, దానిలో ప్రతి ఆజ్ఞ ఒక ముఖ్య బిందువు కావచ్చు. రెండు ప్రసంగాలను సిద్ధపరచుట మరొక సాధ్యత. ఒకరు మొదటి నాలుగు ఆజ్ఞలను ప్రసంగించవచ్చు మరొకరు మిగిలిన ఆరు ఆజ్ఞలను ప్రసంగించవచ్చు. వీటిని పది వేర్వేరు ప్రసంగాలుగా చేయవచ్చు, దానిలో ప్రతిది ఒక ఆజ్ఞను గూర్చి మాట్లాడుతుంది.

## మన రెండు గొప్ప ప్రేమలు (20:1-17)

"దేవుని ప్రేమించుట" మరియు "పొరుగు వానిని ప్రేమించుట" రెండు గొప్ప ఆజ్ఞలు అని యేసు చెప్పాడు. "దేవుని ప్రేమించుటకు" మరియు "పోరుగు వానిని ప్రేమించుటకు" ఏమి కావాలి? ధర్మశాస్త్రము ఈ రెండు ఆజ్ఞలపై ఆధారపడియుంది కాబట్టి (మత్తయి 22:40), "దేవుని ప్రేమించుట" మరియు "పోరుగు వానిని ప్రేమించుట" అంటే ఏమిటో పది ఆజ్ఞలు ఉదాహరణగా చెబుతుంది. పది ఆజ్ఞలు మనకు సూటిగా వర్తించబడకపోయినప్పటికీ, అవన్ని (విశ్రాంతి దిన ఆజ్ఞ మినహా) క్రొత్త నిబంధనలో మరలా చెప్పబడ్డాయి. కాబట్టి, ఒకవేళ మనం దేవుని ప్రేమిస్తే, మొదటి నాలుగు ఆజ్ఞలను (లేక వాటిని పోలినవాటిని) పాటిస్తాము. మనం ఇతరులను ప్రేమిస్తే, చివరి ఆరు ఆజ్ఞలకు క్రొత్త నిబంధన సమానమైన ఆజ్ఞలను పాటిస్తాము: మన తల్లిదండ్రులను సన్మానిస్తాము, హత్య, దొంగతనం, వ్యభిచారం చేయము, అబద్ధ సాక్ష్యం చెప్పము, దురాశను కలిగియుండము.

## ఎందుకు పాపం చేయకూడదు? (20:5)

"దేవుడు కరుణ మరియు కృప కలిగి పాపమును క్షమిస్తే, పాపము చేయుట లేక చేయకపోవుటను గూర్చి చింతించవలసిన పని ఏమిటి?" ఈ ప్రశ్నకు అనేక విధాలుగా జవాబును ఇవ్వవచ్చు గాని, నిర్గమ. 20:5 దానికి మంచి జవాబును ఇస్తుంది. మీ పాపము కేవలం మిమ్మును గాక ఇతరులను, రానున్న తరాలను కూడా గాయపరుస్తుంది. తండ్రుల పాపము మూడు లేక నాలుగు తరాల వారిపై ప్రభావం చూపిన ఉదాహరణలు కోకొల్లలు.

## విశ్రాంతి దినము (20:10)

విశ్రాంతి దినము యొక్క ఉద్దేశము, ఇశ్రాయేలీయులకు మరియు వారి మీద ఆధారపడియున్న దాసులకు మరియు పశువులకు ఒక దినము విశ్రాంతినిచ్చుట. మన మీద ఆధారపడియున్న వారిని గూర్చి ఆలోచించాలని మరియు వారి అవసరతలు తీర్చబడునట్లు చూడాలని ఇది మనకు బోధిస్తుంది.

సూచనలు

[1]R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 152. [2]Ibid. [3]B. Davie Napier, *The Book of Exodus*, The Layman's Bible Commentary, vol. 3 (Atlanta: John Knox Press, 1963), 75 నుండి సేకరించబడింది. [4]David R. Worley, Jr., "God's Gracious Love Expressed: Exodus 20:1-17," *Restoration Quarterly* 14 (3d-4th Quarter, 1971): 186. [5]Martin Noth, *Exodus*, trans. J. S. Bowden, The Old Testament Library (Philadelphia: Westminster Press, 1962), 162. [6]చూడండి Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *The Brown-Driver-Briggs Hebrew and English Lexicon* (Boston: Houghton, Mifflin and Co., 1906; reprint, Peabody, Mass: Hendrickson Publishers, 1997), 818-19. [7]అయితే, *pesel* అను పదము కళాకారుల ద్వారా చెక్కబడిన పూత విగ్రహాలను సంబోధిస్తూ పాత నిబంధనలో చాలా కాలం తరువాత ఉపయోగించబడింది (యెష. 40:19; 44:10). [8]James Burton Coffman, *Commentary on Exodus, The Second Book of Moses* (Abilene, Tex.: ACU Press, 1985), 273. [9]Walter C. Kaiser, Jr., "Exodus," in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers* (Grand Rapids, Mich.: Zondervan, 1990), 422-23. [10]Warren W. Wiersbe, *Be Delivered* (Colorado Springs, Colo.: Victor, 1998), 110.

[11]W. H. Gispen, *Exodus*, trans. Ed van der Maas, Bible Student's Commentary (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1982), 192. [12]Ibid., 192-93. [13]Nahum M. Sarna, *Exodus*, The JPS Torah Commentary (New York: Jewish Publication Society, 1991), 111. [14]Ibid. [15]Coffman, 278. [16]Wilbur Fields, *Exploring Exodus*, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1976), 429. (See Mal. 4:4.) [17]Ibid., 433-34. The promise was later tied to several other commands (Deut. 4:40; 5:33; 6:1, 2; 11:8, 9; 22:6, 7; 30:15-18; 32:44-47). [18]Ibid., 434. [19]The NKJV, NIV, and NRSV have the same wording as the NASB. [20]J. Philip Hyatt, *Exodus*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 214. *Ratsach* is అను పదము రక్తమునకు ప్రతీకారము తీర్చుకొనువాడు చట్టరిత్య ఉపయోగించిన హత్యకు (సంఖ్యా. 35:27, 30) లేక పొంచియుండక చంపుటకు (ద్వితీ. 19:3, 4, 6; Josh. 20:3, 5, 6) ఉపయోగించిన సందర్భాలు ఉన్నాయి.

[21]Walter J. Harrelson, "Ten Commandments," in *The Interpreter's Dictionary of the Bible*, ed. George Arthur Buttrick (Nashville: Abingdon Press, 1962), 4:571. [22]ఎనిమిదవ ఆజ్ఞ ముఖ్యముగా ఒక మనుష్యుని దొంగిలించుట లేక కిడ్నాప్ కు సంబంధించినది అని కొందరు నమ్ముతారు (ద్వితీ. 24:7; 1 తిమోతి 1:10). (Worley, 202.) [23]Worley, 202. [24]Fields, 437. [25]Ibid., 437-38. [26]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 298. [27]Ibid., 303. [28]F. B. Huey, Jr., *Exodus*, Bible Study Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1977), 95. [29]Durham, 320. [30]L. Daniel Hawk, "Altars," in *Dictionary of the Old Testament: Pentateuch*, ed. T. Desmond Alexander and David W. Baker (Downers Grove, Ill.: InterVarsity Press, 2003), 33.

[31]Durham, 320.